నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్ : 11 కేవీ నాచారం శాంతి గార్డెన్ ఫీడర్ పరిధిలో విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 11 గంటల నుంచి 11.30 వరకు శాంతి గార్డెన్స్ అపార్ట్‌మెంట్స్, ఇందిరానగర్, రాఘవేంద్రనగర్, కాంక్రిట్ ప్లాజా అపార్ట్‌మెంట్స్ ఏరియాలో విద్యుత్ సరాఫరాను నిలిపేస్తున్నట్లు నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు.

మేడిపల్లి : 11కేవీ కెనరానగర్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 33/11కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ, బుద్ధానగర్, కెనరానగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ 11 కేవీ బుద్ధానగర్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీఅండ్‌టీ కాలనీ, బుద్ధానగర్, మల్లికార్జుననగర్, వరంగల్ హైవేలో కరెంట్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని విద్యుత్ ఏఈ హరినాథ్ సగ్గు ఓ ప్రకటనలో తెలిపారు.

మల్కాజిగిరి : వినాయకనగర్ సబ్‌స్టేషన్ 11 కేవీ దేవీనగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు కృపాకాంప్లెక్స్, శ్రీకృష్ణనగర్, సీతారాంనగర్, సైనిక్‌నగర్, రాంబ్రహ్మనగర్, దేవీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సుమన్ క్రిస్టినా తెలిపారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతి కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శృతిలయ డాన్స్ అకాడమీ గురువు మంజు మోహిని శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. రోహిణి, శాంతి, నళినాక్షి, హాసిని, అనన్య తదితరులు కాళింగ నర్తన, నాట్య హెల్త్ కొలువై ఉన్నాడే, జయజయ దుర్గే తదితర అంశాలు ప్రదర్శించి మెప్పించారు.

ఉచిత వైద్య శిబిరం

మల్లాపూర్: శ్రీసాయి రాణా మల్టీస్పెషాలటీ ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం మల్లాపూర్ అన్నపూర్ణకాలనీ కమ్యూనిటీహాల్‌లో ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ కాలనీ ప్రధాన కార్యదర్శి కటార్ల శేఖర్‌బాబు మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భద్రతపై పోలీసుల అవగాహన



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి

మేడిపల్లి: మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కాలనీల ప్రతినిధులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి కాలనీల్లో తప్పనిసరిగా సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సైబర్ మోసాలకు గురికావొద్దని, కాలనీల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. డయల్ 100, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర విషయాలపై అవగాహన కల్పించారు.

బంగారం వ్యాపారి కిడ్నాప్ !

నిందితుల రిమాండ్

మల్కాజిగిరి: వ్యాపార లావాదేవీల్లో ఓ బంగారం వ్యాపారిని కిడ్నాప్ చేసిన ఘటనలో ఏడుగురు నిందితులను మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈస్ట్ ఆనంద్‌బాగ్‌కు చెందిన రాంచందర్ బంగారు నగల వ్యాపారి. కాగా అతడు కొంతకాలంగా నకిలీ బంగారు ఆభరణాలు తయారుచేసి రాంపల్లి, సరూర్‌నగర్ ప్రాంతాలకు చెందిన వారి ద్వారా వివిధ ప్రైవేటు బంగారు ఫైనాన్స్ సంస్థల్లో వాటిని పెట్టి నగదు కాజేసేవాడు. అతడు తయారు చేసిన ఆభరణాలు నకిలీవని గుర్తించిన విజయ్, అంజన్‌కుమార్, డేవిడ్ సెబాస్టియన్, రవికిరణ్, కాంబ్లే విక్కీ, కుశాల్, సాయికుమార్‌లు ఈనెల 6న అర్ధరాత్రి రాంచందర్‌పై దాడిచేసి గాయపరిచారు. ఈ ఘటనలో అతడి భార్య వందన పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను ఆదివారం మల్కాజిగిరి రైల్వేస్టేషన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఏడుగురికి రిమాండ్ విధించినట్లు తెలిపారు.

నాడు అవార్డులు.. నేడు అధ్వానం

- తడి, పొడి చెత్తను వేరు చేయకుండా సేకరిస్తున్న వైనం
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు



డంపింగ్ యార్డులో కుప్పలుగా వ్యర్థాలు

బోడుప్పల్ : బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న చెత్త డంపింగ్ యార్డు నుంచి దుర్వాసన వెదజల్లుతోంది. ఇళ్ల నుంచి సేకరించే చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేయకుండా సేకరిస్తున్నారు. సేకరించిన వ్యర్థాలను స్వచ్ఛ ఆటోల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో పరిసర ప్రాంతాల్లో దుర్వాసనతో కార్మికులు అనారోగ్యం పాలవుతున్నారు. 5 ఏళ్ల ముందు మోడల్ చెత్త డంపింగ్‌గా ఉండేది. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో నేడు అధ్వానంగా మారింది.

రోజుకు 52 టన్నుల వ్యర్థాల సేకరణ..

నగర పాలకసంస్థ పరిధిలో 190కు పైగా కాలనీలు ఉన్నాయి. ఆ కాలనీ నుంచి రోజుకు 52 టన్నుల చెత్త వస్తుంది. 262 మంది శానిటేషన్ సిబ్బంది పని చేస్తున్నారు. 68 స్వచ్ఛ ఆటోల ద్వారా ఇళ్ల నుంచి చెత్తను సేకరిస్తున్నారు. ఇవి కాకుండా మున్సిపల్ ఆధ్వర్యంలో 10 ట్రాక్టర్లు, 5 ఆటోలు ఉన్నాయి. 20 మంది సూపర్‌వైజర్లు, ఒక హెల్త్ అసిస్టెంట్, ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్ విధులు నిర్వహిస్తున్నారు.

నాడు మోడల్.. నేడు డంపింగ్..

ఐదేళ్లకు ముందు మోడల్ చెత్త డంపింగ్‌గా ఉండేది. అన్ని రకాల మొక్కలతో ఒక వనాన్ని తలపించేది. కేంద్రప్రభుత్వం నుంచి పలుమార్లు స్కోచ్ అవార్డులు కూడా వరించగా.. ప్రస్తుతం అధ్వానంగా నిర్వహణ ఉంటోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి, ఆంధ్రప్రదేశ్, సిక్కిం, భోపాల్, బీహార్, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధికారులు ఇక్కడకు వచ్చి డంపింగ్‌పై అధ్యాయనం చేశారు. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు ప్రశాంతంగా ఉండేది. అధికారులు సిబ్బందితో కలిసి భోజనాలు చేసిన ఘటనలు ఉన్నాయి.

నిర్లక్ష్యానికి గురైన డంపింగ్ యార్డు..

గడిచిన ఐదేళ్ల నుంచి బోడుప్పల్‌లోని చెత్త డంపింగ్ యార్డు నిర్లక్ష్యానికి గురైంది. అధికారులు, పాలక వర్గం పట్టించుకోలేదు. చెత్త డంపింగ్‌కు సంబంధించిన మిషన్ల కొనుగోళ్లు, చెత్త ప్రాసెసింగ్ చేయలేదు. కేవలం ఇళ్ల నుంచి సేకరించిన వ్యర్థాలను మాత్రమే డంపింగ్‌కు తీసుకొస్తున్నారు. డంపింగ్ యార్డులో తడిచెత్త, పొడిచెత్తను వేరు చేసి ప్లాస్టిక్‌ను విక్రయిస్తున్నారు. తడిచెత్తను విండ్రో కంపోస్టు తయారు చేస్తున్నారు. మిగిలిన వ్యర్థాలను జవహర్‌నగర్‌కు తరలిస్తున్నారు.



విండ్రో కంపోస్టు ఇలా..



నిరుపయోగంగా లిట్టర్ బిన్స్

చెత్తపై నిర్లక్ష్యం చేశారు...



గత ఐదేళ్ల నుంచి మేయర్లు, అధికారులు చెత్త డంపింగ్‌పై నిర్లక్ష్యం వహించారు. చుట్టుపక్కల ఉన్న కాలనీవాసులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. వర్షాకాలంలో డంపింగ్ యార్డు నుంచి మురుగు మా కాలనీలోకి వస్తుంది. గతంలో నాటిన మొక్కలు అన్ని చనిపోయాయి. తిరిగి మొక్కలను నాటలేదు. చెత్తను లోడ్ చేసి జవహర్‌నగర్‌కు తరలించేటప్పుడు భరించరాని దుర్వాసన వస్తోంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

– అబ్రహం లింకన్, సాయినగర్ కాలనీవాసి.

విద్యార్థులను సంస్కారవంతులుగా తీర్చిదిద్దాలి

ఎంపీ ఈటల రాజేందర్

రామంతాపూర్ : విద్యార్థులకు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను బోధించి వారిని సంస్కారవంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో నిర్వహించిన సత్యసాయి స్కూల్ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు ఇంట్లో గమనించాలని, సెల్‌ఫోన్ నుంచి విద్యార్థులకు అవసరమయ్యే విజ్ఞాన సమాచారాన్ని మాత్రమే పొందేలా తల్లిదండ్రులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్కూల్ చైర్మన్ గద్దం సాయికిరణ్, ఈటల భద్రయ్య, మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటేష్, వెంకట్‌సాయి తదితరులు పాల్గొన్నారు.



వార్షికోత్సవ వేడుకల్లో ఎంపీ ఈటల రాజేందర్

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం..

మల్కాజిగిరి: లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం బాలాజీ గార్డెన్స్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రీజియన్ సమావేశం రీజనల్ చైర్మన్ జీడీ బాలచందర్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగాల్లో లయన్స్ క్లబ్స్ సేవలు చిరస్మరణీయమన్నారు. ఆ రెండు రంగాల్లోనే కాకుండా ఇతర అంశాల్లో వారి సేవలు మార్గదర్శకంగా నిలిచాయన్నారు. ప్రముఖ వ్యాఖ్యాత మల్లికార్జునరావు, పూర్వ డిస్ట్రిక్, వైస్ డిస్ట్రిక్ గవర్నర్లు లింగారెడ్డి, రవీంద్రనాథ్‌గుప్తా, నాగేశ్వరరావు, విశ్వేశ్వరరావు, పాండురంగారావు, సాంబశివరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ ఈటలకు జ్ఞాపికను అందజేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తా



కార్పొరేటర్ శాంతికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మల్లాపూర్: నాచారం ఎర్రకుంట, పటేల్‌కుంట చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు కృషి చేస్తామని నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఆదివారం కాలనీవాసులు చెరువులో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిందని, తొలగించిన గుర్రపు డెక్క చెరువు కట్టపైనే పేరుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్ అధికారులతో మాట్లాడి తొలగించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. జీవన్‌కుమార్, అనంతచారి, సయ్యద్ ఇబ్రహీం, సత్తార్, సలీం, రబ్బాని, రమేష్ తదితరులున్నారు.

రాజకీయాలకు అతీతంగా సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని మధుసూదననగర్ కమ్యూనిటీహాల్‌లో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి చొరవ చూపిస్తూ.. ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. మధుసూదన్‌నగర్ వార్డు కార్యాలయాన్ని కాలనీకి అప్పగించేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్పొరేటర్ మేకల సునీతారాము యాదవ్, మాజీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, నాయకులు బైరు అనిల్, రాముయాదవ్, కాలనీవాసులు సుబ్బారావు, చంద్రశేఖర్, సుదర్శన్, రఘుయాదవ్, బాలకృష్ణ, మెహర్‌బాబా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

డెలివరీ బాయ్ ఆత్మహత్య

ఉప్పల్: డెలివరీ బాయ్ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఉప్పల్ డివిజన్ కురుమానగర్‌లో స్నేహితులతో కలిసి ఉంటున్న శ్రావణ్‌కుమార్ (24) డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున తాను ఉంటున్న గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దేవాలయ మండపానికి భూమిపూజ

అల్వాల్: నెరేడ్‌మెట్ చౌరస్తాలోని వరసిద్ధి వినాయక, సాయిబాబా దేవాలయంలో నూతనంగా నిర్మిస్తున్న ముఖ మండపానికి ఆదివారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న ఈ దేవాలయ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందిస్తానన్నారు. ముత్యాల్‌రావు కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు లక్ష్మీనారాయణరెడ్డి, సుబ్బారాయుడు, కొండల్‌రావు, వెంకటేష్‌యాదవ్, కామేష్, రాజేశ్వర్, సుందర్, ఈశ్వర్, శాంతిరావు, జగన్‌రెడ్డి, రాఘవన్, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

సీనియర్ సిటిజన్ క్లబ్‌కు నిధుల కేటాయింపు



పరమేశ్వర్‌రెడ్డితో క్లబ్ ప్రతినిధులు

ఉప్పల్: సీనియర్ సిటిజన్‌లకు అండగా ఉంటూ వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ సీనియర్ సిటిజన్ క్లబ్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 20 లక్షలు కేటాయించడంపై వారు పరమేశ్వర్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప్పల్ మెయిన్‌రోడ్డులో ఇప్పటికే క్లబ్ నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించినట్లు వివరించారు. మేకల రాంరెడ్డి, వెంకటయ్యగౌడ్, మనోహర్, కుమారస్వామి, నారాయణగౌడ్, నర్సింహారెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి కల్యాణమహోత్సవం



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానంలో శ్రీవారి కల్యాణం ఆదివారం ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, అర్చకులు తులసీరమణాచార్యులు, వేణుగోపాలాచార్యులు ఘనంగా నిర్వహించారు. ప్రతినెల రెండో ఆదివారం స్వామివారి కల్యాణం నిర్వహిస్తామని ఈవో రవీందర్‌రెడ్డి వివరించారు. క్లర్క్ సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



ఎగ్జిబిట్‌లను పరిశీలిస్తున్న రీజనల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి



నమూనాలతో విద్యార్థులు

మల్లాపూర్: విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ టీజీ, ఏపీ రీజనల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. నాచారం అకడమిక్ పబ్లిక్ స్కూల్‌లో రెండ్రోజుల పాటు నిర్వహించిన ప్రకల్ప విజ్ఞానశాస్త్ర ప్రదర్శన ఆదివారంతో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై నమునాలను పరిశీలించారు. కృత్రిమ మేధస్సు, పర్యావరణ పరిరక్షణ, సాంకేతిక ఆవిష్కరణలు, ఆదిత్యాయల్‌వన్, చంద్రయాన్, కోల్‌మైనింగ్ తదితర అంశాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ శివకుమార్ మట్లాడుతూ.. వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కరస్పాండెంట్ కల్పన, ప్రధానోపాధ్యాయురాలు నిషాత్ అంజుం తదితరులు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ దంపతులకు ఆత్మీయ సత్కారం



బోడుప్పల్: కాలనీల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు 14వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కంభం కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆర్ఎన్ఎస్ రాయల్ మెడల్స్ కాలనీవాసులు ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయసమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డివిజన్‌లో 100 శాతం సీసీరోడ్లు వేసినట్లు వివరించారు. పార్కుల అభివృద్ధికి కృషి చేసినట్లు వివరించారు. కాలనీవాసులు మాజీ కార్పొరేటర్ దంపతులను సత్కరించారు. కాలనీ అధ్యక్షుడు జలందర్‌రెడ్డి, కాలనీవాసులు శరత్, నరేందర్, రాజు, ప్రవీణ్‌రెడ్డి, కార్తీక్, వేణు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ బ్రహ్మోత్సవాలు

రామంతాపూర్ : వెంకట్‌రెడ్డినగర్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో గత రెండ్రోజులుగా నిర్వహిస్తున్న అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి రుద్రాభిషేకం, అలంకరణ, చండీహోమం, పూర్ణాహుతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు హాజరైన ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ఆలయ వ్యవస్థాపకులు గంజి రాజమౌళి గుప్తాలు మాట్లాడుతూ.. అమ్మవారిని మనస్ఫూర్తిగా ఆరాధిస్తే భక్తుల కోర్కెలు నెరవేరుతాయన్నారు. పురుషోత్తం గుప్తా, కృష్ణమూర్తి, అధ్యక్షుడు భువనగిరి శ్రీనివాసులు, కోశాధికారి నాగేష్ , రమేష్, పాండయ్య, అమృతమ్మ, జయమ్మ, పద్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

అల్వాల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని భోగ విష్ణుమూర్తి అన్నారు. ఆదివారం అల్వాల్ హెచ్ఎంటీ ఆఫీసర్స్ కాలనీలో స్టీల్ గిన్నెల బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ ప్లేట్లకు బదులుగా స్టీల్ ప్లేట్లు వాడాలని, ప్లాస్టిక్ గ్లాసులకు బదులుగా స్టీల్ గ్లాసులు, సీసాలను వాడాలని, ప్లాస్టిక్ బ్యాగ్ బదులుగా బట్ట బ్యాగులను వాడాలని సూచించారు. ఎవరికైనా స్టీల్ ప్లేట్లు కావాలంటే ఉచితంగా ఇస్తున్నామన్నారు. పర్యావరణ జిల్లా సంయోజక్ మల్లిఖార్జున్, శ్రీనివాస్‌రెడ్డి, అతీశ్, రాజు, జగన్, సురేందర్, మల్లిఖార్జున్‌రెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.



అల్వాల్ హెచ్ఎంటీ ఆఫీసర్స్ కాలనీలో స్టీల్ గిన్నెలను అందజేస్తున్న దృశ్యం